సంఘటితంగా కొట్లాడుదాం

- హామీల అమలుపై సర్కార్‌ను నిలదీద్దాం
- మనలో పోరాట పటిమ పోలేదు
- కేసులకు భయపడొద్దు.. నిలదీద్దాం
- కాంగ్రెస్ పాలనలో కార్మికుల బతుకులు అగమ్యగోచరం
- తెలంగాణ భవన్.. జనతా గ్యారేజ్
- కార్మికలోకానికి బీఆర్ఎస్ అండ..
- బీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణలో కేటీఆర్

బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో జరిగిన కార్మిక సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్.
చిత్రంలో మధుసూదనాచారి, మహమూద్ అలీ, జగదీశ్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎల్ రమణ, రాంబాబు యాదవ్ తదితరులు

హైదరాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ) : 'కాంగ్రెస్ ఏడాది పాలనలో కార్మికలోకానికి అడుగడుగునా అన్యాయం జరిగింది..ఇచ్చిన హామీలు అమలు చేయాలని అడిగితే జైల్లో పెట్టి భయపెట్టాలని చూస్తున్నది. ఎట్టి పరిస్థితుల్లోనూ కేసులకు భయపడొద్దు.నిలదీయడం ఆపొద్దు'అంటూ బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. సంఘటితంగా కొట్లాడి రేవంత్ సర్కార్‌కు చుక్కలు చూపుదామని సూచించారు. కొత్త సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ సాక్షిగా ఉద్యమ కార్యాచరణకు సిద్ధంకావాలని నిర్దేశించారు. పోయింది అధికారమే తప్ప..పోరాటపటిమ కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలని, కొట్లాడే కార్మిక సంఘాల నేతలకు బీఆర్ ఎస్ అండగా ఉంటుందని అభయమిచ్చారు. సోమవారం తెలంగాణ భవన్‌లో బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మాజీ మంత్రులు మహమూద్‌అలీ, జగదీశ్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డితో కలిసి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ కేసీఆర్ పదేండ్ల పాలనలోనే కార్మికులకు న్యాయం జరిగిందని, ప్రభుత్వం ఏర్పడ్డ 15 రోజుల్లోనే హమాలీల సమస్యలు పరిష్కరించారని, రాష్ట్రం ఏర్పడక ముందు 8 రూపాయలు ఉన్న కూలీని 26 రూపాయలకు పెంచిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని చెప్పారు.

ఓట్లు లేకున్నా వలస కార్మికులను ఆదుకున్నరు

కరోనాకాలంలో అష్టకష్టాలు పడ్డ 35 లక్షల మంది వలస కార్మికులను కేసీఆర్ ఆదుకున్నారని కేటీఆర్ గుర్తుచేశారు. వారికి ఓట్లు లేకున్నా రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములుగా గుర్తించారని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా వారికి కష్టకాలం లో కడుపునిండా అన్నంపెట్టి వెయ్యి చొప్పున చేతి లో పెట్టి సొంతూళ్లకు పంపించి గొప్ప మనుసును చాటుకున్నారని కొనియాడారు. సఫాయి కార్మికుల శ్రమను గుర్తించి 3 సార్లు వేతనాలు పెంచారని తెలిపారు.

కేంద్రమంత్రిగా బీడీ కార్మికులకు ఇండ్లు

2004లో కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కేసీఆర్ దేశంలోని అసంఘటిత రంగ కార్మికుల అభ్యున్నతికి విశేషంగా కృషి చేశారని కేటీఆర్ చెప్పారు. వేలాదిమంది బీడీ కార్మికులకు ఇండ్లు మంజూరు చేశారని, తెలంగాణ వచ్చిన తర్వాత దేశంలోనే ఎక్కడా లేనివిధంగా 4.5 లక్షల మంది బీడీలు చుట్టే ఆడబిడ్డలకు పింఛన్లు ఇచ్చి ఆదుకున్నారని గుర్తుచేశారు. సమైక్య పాలనలో అంగన్‌వాడీలకు తమకు కనీస వేతనమివ్వాలని అడిగిన పాపానికి నాటి సర్కారు గుర్రాలతో తొక్కిస్తే.. స్వరాష్ట్రంలో కేసీఆర్ అండగా నిలిచారని చెప్పారు. రూ.4500 ఉన్న వారి వేతనాన్ని ఏకంగా రూ.13,650కి పెంచి ఆదుకున్నారని చెప్పారు. 2014లో రూ. 2500 ఉన్న ఆశ కార్యకర్తల వేతనాలను రూ. 9,750కి పెంచి వారి కండ్లల్లో ఆనందం చూస్తే, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పోలీసులతో కొట్టించి పైశాచికానందం పొందారని దుయ్యబట్టారు. రూ. 9000 ఉన్న హోంగార్డుల వేతనాన్ని రూ. 27వేలకు పెంచారని, 12లక్షల మంది ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలను పీఆర్సీ పరిధిలోకి తెచ్చిన దేశంలోనే ఏకైక నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. అర్చకులు, మౌజమ్‌లకు సైతం గౌరవవేతనమిచ్చి గౌరవించారని, 20 లక్షల మంది క్యాబ్, ఆటో డ్రైవర్లకు రూ.5 లక్షల ప్రమాద బీమా ఇచ్చి ధీమాగా నిలిచారని గుర్తుచేశారు.

ఒకటో తేదీన వేతనాలంటూ సీఎం అబద్ధాలు

అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఉద్యోగులకు ఒకటో తేదీనే వేతనాలు ఇస్తున్నామంటూ సీఎం రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాలు ఆడుతున్నారని కేటీఆర్ దుయ్యబట్టారు. రిసోర్స్ పర్సన్లకు ఆరునెలలుగా, మున్సిపల్ కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలందక ఆకలితో అలమటిస్తుంటే సీఎం పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు, ఏడాదికి రూ.12 వేలు ఇస్తామంటూ ఆటోడ్రైవర్లను కూడా మోసం చేశారని నిప్పులు చెరిగారు.

అప్పులపై తప్పుడు లెక్కలను తిప్పికొట్టాలె..

కేసీఆర్ పదేండ్లలో రూ.4 వేల కోట్ల అప్పులు చేసి అనేక ఆస్తులు సృష్టించారని, భూముల విలువ పెంచి పేదలకు ఆర్థిక భరోసా కల్పించారని, నల్ల గొండ జిల్లా దామరచర్లలో నాలుగు వేల మెగావాట్ల విద్యుత్తు ప్లాంట్ కట్టారని, కాళేశ్వరం లాంటి మహోన్నత ప్రాజెక్టుతో పాటు సచివాలయం, 33 జిల్లాల్లో మెడికల్ కాలేజీలు, వైద్యశాలలు, గురుకులాలు నిర్మించారని కేటీఆర్ గుర్తుచేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలోనే రూ.1.40 లక్షల కోట్ల అప్పులు తెచ్చి చేసిందేమిటని నిలదీశారు. పాలన చేతగాక అప్పుల విషయంలో బీఆర్ఎస్‌పై రేవంత్ రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆక్షేపించారు. ఆయన తప్పుడు లెక్కలను కార్మిక నాయకులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. 50 ఏండ్లు దేశాన్ని నడిపిన కాంగ్రెస్‌కు సంపద పెంచడం తెలుసని గొప్పులు చెప్పిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇప్పుడు చేతులు ఎత్తేస్తున్నారని ఎద్దేవాచేశారు. 8వేల మంది రిటైర్డ్ ఉద్యోగులు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం అడుగుతుంటే ముఖ్యమంత్రి ముఖం చాటేస్తున్నారని దునుమాడారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించాల్సిన సమయం ఆసన్నమైందని కార్మిక నాయకులకు కేటీఆర్ సూచించారు. ప్రశ్నించేవారికి బీఆర్ఎస్ అడుగడుగునా అండగా ఉంటుందని స్పష్టంచేశారు. సర్కారు తప్పుడు కేసులు పెడితే లీగల్ టీంలను పంపించి న్యాయ సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఆపన్నులు ఎప్పుడొచ్చినా తెలంగాణ భవన్ జనతా గ్యారేజ్ తరహాలో ఆదుకుంటుందని అభయమిచ్చారు. కార్మికసంఘాలు భయంలేకుండా కార్యాచరణకు పూనుకోవాలని పిలుపునిచ్చారు.

లోకం పోకడ



మమ్మల్ని గెలిపిస్తే త్రివేణి సంగమాన్ని ఢిల్లీకి తరలించి భారీ కంభమేళా నిర్వహిస్తాం!

నాడు ధగధగ నేడు ధర దడ

మొదటిపేజీ తరువాయి...

యాదగిరిగుట్ట దగ్గర గౌరాయపల్లికి ఇచ్చినం. రాష్ట్రం రాక ముందు అక్కడ ఎకరం రూ.2 లక్షలుండె. తెలంగాణ వచ్చి నంక కోటి రూపాయలైంది. యాదగిరిగుట్టకు కేసీఆర్ వచ్చిపోయిన ప్రతీసారి ఎకరం భూమి విలువ రూ.5 లక్షల చొప్పున పెరిగింది. కోటి రూపాయల దాక ధరవచ్చింది. నా బిడ్డ కోటీశ్వరురాలైందని మస్తు సంబురపడ్డం. కాంగ్రెస్ వచ్చినంక ధర దారుణంగా పడిపోయింది. 30 లక్షలు తగ్గిపోయింది. ఎకరం 70 లక్షలకు అమ్ముదామన్నా కొనేనాథుడే లేడు. చిన్న బిడ్డను గవర్నమెంట్ ఉద్యోగికి ఇచ్చినం. తెలంగాణ రాష్ట్రం రాకముందు అల్లుడి జీతం 30 వేలుంటే కేసీఆర్ సారు పుణ్యాన అది డబుల్ అయ్యింది. అప్పట్ల ఏక్‌ధమ్ రూ.60 వేలయ్యింది. మా హమాలీ కూలీలు కూడా కేసీఆర్ పెంచిండు. 5లక్షల బీమాతో ధీమా ఇచ్చిండు. కార్మికులను కడపుల పెట్టి మాసుకున్న కేసీఆర్‌ని జనం ఆశకు పోయి ఒడగొట్టుకున్నరు. ఇయ్యాల కేసీఆర్‌ను దూరం చేసుకున్నందుకు బాధపడని గుండె లేదు. కార్మికులు, విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు అందరూ గోస పడుతున్నరు' అని శ్రీనివాస్ చెప్పారు.

'ఆరెకటిక'ను యథావిధిగా
కొనసాగించాలి

బీసీ కమిషన్‌కు కులసంఘం వినతి

హైదరాబాద్, జనవరి20 (నమస్తే తెలంగాణ): ఆరెకటిక కులం పేరును మార్పు చేయకుండా యథావిధిగా కొనసాగించాలని రాష్ట్ర ఆరెకటిక సంఘం ప్రతినిధుల బృందం కోరింది. ఈ మేరకు సోమవారం నాడు రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌ను కలిసి ఆ బృందం వినతిపత్రం అందజేసింది. రాష్ట్రంలోని కభేళాలను వేలం ద్వారా కేటాయించడంతో ఆరెకటికలకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని ఆరెకటిక సంఘం రాష్ట్ర నేతలు తెలిపారు. కాంట్రాక్ట్ దక్కించుకున్నవారు మేకలను కోయడానికి ఇష్టానుసారంగా డబ్బులు వసూలు చేస్తున్నారని వారు ఈ సందర్భంగా కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. కొన్ని జిల్లాల్లో గ్రామాభివృద్ధి కమిటీ పేరిట ఆరెకటికలపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని కమిషన్ దృష్టికి తీసుకెళ్లింది. ఇతర కులాలకు కల్పిస్తున్న సౌకర్యాలను ఆరెకటికులకూ కల్పించాలని, వృత్తిలో ఉన్నవారికి రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించాలని కోరింది.

రైతు ఆత్మహత్యలపై బీఆర్ఎస్ కమిటీ

మొదటిపేజీ తరువాయి...

కురుకుపోతున్నాని ఆవేదన చెందారు. కాంగ్రెస్ అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాల వల్లే రాష్ట్ర వ్యవసాయ రంగం పూర్తిగా చిన్నాభిన్నమైందని విమర్శించారు.

బాధ్యతాయుత ప్రతిపక్షంగా

రైతులు, వ్యవసాయ రంగాన్ని పట్టించుకోకుండా దిక్కులు చూస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి దిశానిర్దేశం చేసేలా ప్రధాన ప్రతిపక్షంగా తమ వంతు పాత్ర పోషించాలనే సదుద్దేశంతోనే ఈ అధ్యయన కమిటీని ఏర్పాటు చేసినట్టు కేటీఆర్ తెలిపారు. పదేండ్ల పాటు రైతును రాజును చేసే లక్ష్యంతో పనిచేసిన బీఆర్ఎస్ పార్టీ ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నదని తెలిపారు. విస్తృత పర్యటనలు, అధ్యయనం తర్వాత పార్టీ తరపున రూపొందించే ఈ నివేదిక ప్రభుత్వానికి అందజేసి రానున్న బడ్జెట్ సమావేశాల్లో రైతుల సమస్యలపై వారికి ఇచ్చిన హామీల అమలుపై, రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తామని పేర్కొన్నారు.

కమిటీలో సభ్యులెవరంటే..?

రాష్ట్ర వ్యవసాయశాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సారథ్యంలోని కమిటీలో సభ్యులుగా మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, జోగు రామన్న, పువ్వాడ అజయ్, ఎమ్మెల్సీలు ఎంసీ కోటిరెడ్డి, యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, రసమయి బాలకిషన్, అంజయ్య యాదవ్ ఉన్నారు.

రైతు ఆత్మహత్యలన్నీ సర్కారు హత్యలే

- ఏడాదిలో 400 మంది ఆత్మహత్య
- అయినా సర్కార్‌లో చలనం లేదు
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ఏడాది పాలనలో 400 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్టయినా లేదని రాష్ట్ర వ్యవసాయశాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ధ్వజమెత్తారు. రైతు ఆత్మహత్యలన్నీ సర్కారు హత్యలేనని విమర్శించారు. పండుగలాంటి వ్యవసాయ రంగాన్ని కాంగ్రెస్ సర్కార్ తిరోగమనంపాలు చేసిందని మండిపడ్డారు. రెండు రోజుల క్రితం ఆదిలాబాద్ జిల్లాలో వరుసగా ఇద్దరు రైతులు, సోమవారం జోగులాంబ గద్వాల జిల్లాలో ఒకరు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. ఏడాదికాలంగా రోజుకోక రైతు బలవన్మరణానికి పాల్పడటం విషాదకరమని పేర్కొన్నారు. పంట పెట్టుబడికి డబ్బుల్లేక, పంటలకు గిట్టుబాటు ధరరాక రైతులు అప్పుల పాలవుతున్నారని తెలిపారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో రూ.4.5 లక్షల కోట్లతో వ్యవసాయ రంగానికి చేయూతను అందించారని, 11 విడతల్లో రైతుల ఖాతాల్లోకి నేరుగా రూ.73 వేల కోట్లును రైతుబంధు రూపంలో జమచేసిన విషయాన్ని ఆయన ఉదహరించారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలో వ్యవసాయరంగాన్ని నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించిన రైతు దంపతులు

రైతుపై కాంగ్రెస్ నాయకుల దౌర్జన్యం

- అక్రమంగా బాట వేయొద్దన్నందుకు అన్నదాతపై అధికారపార్టీ నేతల దాడి
- పట్టించుకోని పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు
- తహసీల్దార్ కార్యాలయంలోనే రైతు దంపతుల ఆత్మహత్యాయత్నం

దేవరకద్ర, జనవరి 20 : 'నా పట్టా భూమిలో అక్రమంగా బాట వేస్తున్నారు.. అడ్డుకునేందుకు వెళ్తే దాడి చేశారు.. అధికారుల దృష్టికి తీసుకెళ్తే పట్టించుకోవడం లేదు' అని ఓ రైతు తహసీల్దార్ కార్యాలయంలోనే ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లాలో సోమవారం చోటుచేసుకున్నది. బాధిత రైతు కథనం మేరకు.. దేవరకద్ర మండలం చౌదర్‌పల్లికి చెందిన రైతు కంపిలి రామకృష్ణకు గ్రామ శివారులో సర్వే నంబర్ 88లో ఆరెకరాల 6 గుంటల పట్టా భూమి ఉన్నది. పైనున్న పొలాలకు వెళ్లేందుకు బాట కావాలని అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు.. రైతు రామకృష్ణ అనుమతి లేకుండానే గతంలో మట్టితో రోడ్డు వేసేందుకు యత్నించగా అడ్డుకొన్నాడు. దీంతో వారు అతడిపై దాడి చేశారు. పోలీసులకు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా లాభం లేకపోయింది. సోమవారం బాట కోసం మళ్లీ మట్టి వేస్తుండగా.. రామకృష్ణ, అతడి భార్య అరుణ అడ్డుకునేందుకు వెళ్లగా దాడి చేశారు. న్యాయం కోసం పోలీసులు, రెవెన్యూ అధికారులకు విన్నవించినా స్పందన లేదు. దీంతో మనస్తాపం చెందిన రైతు తన వెంట తెచ్చుకొన్న పెట్రోల్‌ను తహసీల్దార్ కార్యాలయంలోనే ఒంటిపై పోసుకున్నాడు. అక్కడున్న వారు అడ్డుకొని పెట్రోల్ డబ్బాను లాక్కున్నారు. స్పందించిన తహసీల్దార్ కృష్ణయ్య రైతు నుంచి పూర్తి వివరాలు అడిగి తెలుసుకొన్నారు. గ్రామంలో విచారణ చేపట్టి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో రైతు శాంతించాడు.

జైలులోనే మగ్గుతున్న లగచర్ల రైతు

- 60 రోజులుగా చంచల్‌గూడ జైలులోనే
- రిమాండ్ ఖైదీగా ఉంటున్న సురేశ్
- విడుదలను అడ్డుకుంటున్న సర్కార్?
- వారెంట్లపై అరెస్టుకు రంగం సిద్ధం!

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, జనవరి 20 (నమస్తే తెలంగాణ): లగచర్ల దాడి కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి తోపాటు 36 మంది రైతులు జైలు నుంచి విడుదలయ్యారు. కానీ మరో నిందితుడైన సురేశ్ మాత్రం 60 రోజులుగా రిమాండ్ ఖైదీగా చంచల్‌గూడ జైలులోనే మగ్గుతున్నాడు. ఆయన విడుదలను కుట్రతో కొందరు అడ్డుకుంటున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ అధికారులపై దాడి కేసులో బెయిల్ మంజూరైనప్పటికీ ఇప్పటివరకు జమానత్‌లను కూడా కోర్టుకు సమర్పించలేదు. విడుదలైతే పోలీసులు అరెస్టు చేస్తారనే కారణంతో నిందితుడి తరపున జమానత్‌లను కోర్టుకు సమర్పించలేదు. సురేశ్ విడుదలను అడ్డుకునేందుకు 145, 154,155 కేసుల్లో ప్రొటెక్షన్ వారెంట్‌పై (పీటీ వారెంట్) అరెస్టు చేసేందుకు బొంరాస్‌పేట్ పోలీసులు రంగం సిద్ధంచేశారని సమాచారం. ఈ మేరకు పీటీ వారెంట్‌ను సోమవారం ప్రత్యేక కోర్టులో దాఖలు చేశారు. ఇటీవల బెయిల్ మంజూరు చేసిన ఉత్తర్వుల ప్రకారం సురేశ్ తరపున రూ.50 వేల చొప్పున ఇద్దరి పూచీత్తును కోర్టుకు సమర్పించాల్సి ఉన్నది. ప్రతీ వారంలో బుధవారం బొంరాస్‌పేట్ పోలీసుల ఎదుల హాజరుకావాలని కోర్టు షరతులు విధించింది. నేటివరకు రెండు జమానత్‌లను కోర్టుకు సమర్పించకపోవడంతో సురేశ్ విడుదలకు ప్రభుత్వం అడ్డుకట్ట వేసినట్టయింది. ఇదే కేసులో బెయిల్‌పై విడుదలైన మరో ఇద్దరు నిందితులను జైలునుంచి విడుదలైన వెంటనే పీటీ వారెంట్‌పై అరెస్టు చేసి హాజరుపర్చడంతో కోర్టు రిమాండ్‌కు తరలించింది. మూడు కేసుల్లో పీటీ వారెంట్లపై జైలులోనే నిర్బంధించేందుకు పైస్థాయిలోనే కుట్ర జరుగుతున్నట్టు అనుమానాలు కలుగుతున్నాయి. తెలంగాణ హైకోర్టులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని సురేశ్ తరపున దాఖలు చేసిన పిటిషన్ తిరస్కరణకు గురైనట్టు సమాచారం. వికారాబాద్ జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారి, కొడంగల్ అభివృద్ధి అధికారులపై రైతులు దాడులకు పాల్పడినట్టు తేల్చి హత్యాయత్నం సెక్షన్‌తోపాటు ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం చట్టం కింద కేసు నమోదు చేయడంతో నాంపల్లిలోని ప్రత్యేక కోర్టుకు ఈ కేసు బదిలీ అయ్యింది. మిగతా మూడు కేసుల్లో పీడీపీటీ సెక్షన్లను జోడించకపోవడం వల్ల ప్రత్యేక కోర్టుకు బదిలీ కాలేదు. మూడు కేసుల్లో అరెస్టు చేస్తే, రెగ్యులర్ బెయిల్ మంజూరుకు ఆటంకం కలుగుతుందన్న కుట్ర స్పష్టంగా కనిసిస్తున్నది.

మరో నలుగురి బలవన్మరణం

మొదటిపేజీ తరువాయి...

వికారాబాద్ జిల్లా దోమ మండలం అయినాపూర్, జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలో జరిగిన ఈ ఘటనలు తెలంగాణలో రైతుల ప్రస్తుత దయనీయ పరిస్థితికి అద్దంపడుతున్నాయి.

సాగు నీరందక దిగుబడి తగ్గి

మానవపాడు మండల కేంద్రానికి చెందిన బొంకురు శేఖర్‌రెడ్డి (32)కి తన తండ్రికి చెందిన మూడెకరాలతో పాటు తన మూడెకరాలు కలిపి మొత్తం ఆరెకరాల పొలం ఉన్నది. కేసీఆర్ హయాంలో సాగునీటికి ఢోకా లేకపోవడం, రైతులకు తగిన ప్రోత్సాహం అందడంతో మరింత కౌలుకు తీసుకొని పంటలు సాగు చేసేవాడు. కాంగ్రెస్ సర్కారు వచ్చాక నిరుడు జూరాల లింక్ కెనాల్ ఆయకట్టు కింద ఉన్న తన ఆరెకరాల్లోనే మిర్చి వేశాడు. సాగునీరు సరిగా అందక దిగుబడి తగ్గింది. కుటుంబ పోషణ భారంగా మారడంతో రూ.8 లక్షల దాకా చేసిన అప్పులు మీదపడ్డాయి. ఈ సరైనా దిగుబడి వస్తుందేమోనన్న ఆశతో పొగాకు, మిర్చి, కంది సాగు చేశాడు. కంది కొనుగోళ్లకు ప్రభుత్వం కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో బహిరంగ మార్కెట్‌లో విక్రయించినా కనీసం పెట్టుబడి కూడా రాలేదు. పొగాకు పంటకు ప్రైవేట్ ఆర్గనైజర్లు మద్దతు ధర కల్పించకపోవడంతో మరింత దిగులు చెందాడు. ఆర్డీఎస్, జూరాల లింక్ కాల్వలకు నెల రోజులుగా నీటి విడుదల నిలిచిపోవడం.. చీడపీడల నుంచి రక్షించుకున్న మిర్చి పంటకు సరైన సమయంలో నీటి లభ్యత లేక దెబ్బతినడంతో ఈ సారి కూడా అప్పులు తీర్చే మార్గం కనిపించలేదు. ఇంకా అప్పుల ఊబిలో కురుకుపోతానేమోనన్న భయంతో సోమవారం ఉదయం గ్రామ సమీపంలోని పంట పొలంలో పురుగుల మందు తాగాడు. అటుగా వెళ్లిన కొందరు రైతులు గుర్తించి అతడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకొని అతడిని మానవపాడు దవాఖానకు తరలించగా అప్పటికే చనిపోయినట్టు డాక్టర్లు ధ్రువీకరించారు.

8 లక్షల అప్పు తీర్చేదారి లేక

సంగెం మండలం పోచమ్మతండా పంచాయతీ పరిధిలోని మహారాజ్‌తండాకు చెందిన బానోత్ తిరుపతి (39) తనకున్న ఎకరన్నర, కౌలుకు తీసుకున్న నాలుగెకరాల భూమిలో పత్తి, మక్క సాగు చేశాడు. దీంతో అతడికి సుమారు రూ.8 లక్షల దాకా అప్పయింది. పంటలు సరిగ్గా పండక, దిగుబడి రాక చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక కొంత కాలంగా మనస్తాపంతో ఉన్నాడు. ఈ నెల 18న వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి 108లో వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు.

బోరు బావులు, పెట్టుబడికి అప్పు చేసి

దోమ మండలం అయినాపూర్‌కు చెందిన బ్యాగరి యాదయ్య(35)కు ఆరెకరం పొలం ఉన్నది. ఇందులో కొంత కాలంగా ప్రైవేట్ వ్యక్తుల దగ్గర రూ.రెండు లక్షల అప్పు చేసి నాలుగు బోరు బావులు వేసినా ఫలితం లేకుండా పోయింది. దీంతో పాటు పంట పెట్టుబడి కోసం కొడంగల్‌లోని ఓ బ్యాంకులో మరింత అప్పు చేశాడు. వాటిని తీర్చే మార్గం కనిపించకపోవడంతో ఆదివారం రాత్రి ఇంటి నుంచి పొలానికి వెళ్లి చింత చెట్టుకు ఉరేసుకొన్నాడు. సోమవారం ఉదయం చుట్టు పక్కల రైతులకు యాదయ్య చెట్టుకు వేళాడుతూ కనిపించాడు. అది గమనించిన వారు కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. అప్పుల బాధ భరించలేకనే తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని భార్య అంజిలమ్మ చేసిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఆనంద్‌కుమార్ కేసు నమోదు చేసుకున్నారు.

రుణమాఫీ మోసానికి మరో రైతు బలి

తాను, తన భార్య కలిసి సాగు కోసం చేసిన రూ.2.30 లక్షల రుణం మాఫీ అయ్యే అవకాశం లేదని మనోవేదనకు గురైన రైతు పురుగుల మందు తాగి దాదాపు పదిరోజుల పాటు దవాఖానలో మృత్యువుతో పోరాడి సోమవారం మృతిచెందాడు. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి మృతుడి మామ నర్సయ్య, స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. నిర్మల్ జిల్లా ఎల్లపెల్లికి చెందిన పిట్టల లింగన్న (41) 15 ఏండ్ల క్రితం పూర్వ కరీంనగర్..ప్రస్తుత జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం గ్రామానికి చెందిన తోకల నర్సయ్య కూతురు లక్ష్మిని పెండ్లి చేసుకున్నాడు. నర్సయ్యకు కొడుకులు లేకపోవడంతో లింగన్నను ఇల్లరికం తెచ్చుకున్నాడు. భార్య పేరిట రెండెకరాలు, తన పేరిట 34 గుంటలు.. దాదాపు మూడెకరాల్లో దంపతులు సాగు చేస్తున్నారు. ఇబ్రహీంపట్నంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో లింగన్న పేరిట రూ.80 వేలు, అతడి భార్య పేరిట రూ.1.50 లక్షల పంట రుణం ఉన్నది. రుణమాఫీపై కాంగ్రెస్ సర్కారు కొర్రీలు పెట్టడం, రూ.2.30 లక్షల రుణం మాఫీ అయ్యే అవకాశం లేదని, వడ్డీతో సహా చెల్లించాలని బ్యాంకు అధికారులు తేల్చిచెప్పడంతో తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. ఇప్పటికే వ్యవసాయ భూమి కొనుగోలు, పంట పెట్టుబడి కోసం దాదాపు రూ.15 లక్షల దాకా అప్పు చేసిన లింగన్న, రూ.2లక్షల రుణమాఫీ కూడా కాకపోవడంతో మనోవేదనకు లోనయ్యాడు. పది రోజుల క్రితం చేనులో పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి వెళ్లాడు. కుటుంబ సభ్యులు మెట్‌పల్లి దవాఖానకు తరలించారు. పది రోజుల పాటు మృత్యువుతో పోరాడిన లింగన్న సోమవారం మృతిచెందాడు. కేసీఆర్ హయాంలో తమకు రూ.80 వేల రుణమాఫీ అయిందని, ఇప్పుడు రుణమాఫీ కాని బాధలోనే తన అల్లుడు ఆత్మహత్య చేసుకొన్నాడని మామ నర్సయ్య బోరున విలపించాడు. లింగన్న భార్య పిట్ల లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ అనిల్ కేసు నమోదు చేసుకున్నారు.

మరో వారం ఎండ, చలి జంటగా!

బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఆవర్తన ద్రోణి

జోగులాంబ మినహా అన్ని జిల్లాల్లో 15 డిగ్రీలలోపు ఉష్ణోగ్రతలు: వాతావరణ శాఖ

హైదరాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తన ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో చలి తీవ్రత కొనసాగుతున్నది. రాష్ట్రవ్యాప్తంగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు 6.5 డిగ్రీల నుంచి 16.3 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. ఉదయం వేళ మంచు కురుస్తుండగా, మధ్యాహ్న సమయంలో ఒకవైపు ఎండలు, మరోవైపు చలి గాలులు వీస్తున్నాయి. కనిష్ఠ ఉష్ణోగ్రతలు మరో వారం పాటు కొనసాగే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ శాఖ పేర్కొన్నది. కుమ్రంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, సంగారెడ్డి, నిర్మల్, రంగారెడ్డి జిల్లాల్లో సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (యూ)లో 6.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్టు వాతావరణ శాఖ తెలిపింది. ఆదిలాబాద్ జిల్లా బేలాలో 8 డిగ్రీలు, సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో 8.9, నిర్మల్ జిల్లా పెంబీలో 9.3, రంగారెడ్డి జిల్లా మొహినాబాద్‌లో 9.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇతర జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 10.5 డిగ్రీల నుంచి 16.3 డిగ్రీలుగా నమోదయ్యాయి